క్లుప్తంగా

మొక్కలు సంరక్షించాలి

తానూరు: నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని ఎంపీవో మోహన్‌సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని మొగ్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. గ్రామంలో ఇంటింటా సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయాలన్నారు. వారి వెంట కార్యదర్శి విఠల్, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన మల్లన్న జాతర

సారంగాపూర్: మండలంలోని మలక్‌చించోలి గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం మల్లన్న యూత్, గ్రామస్తుల ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల భక్తులు ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: నిర్మల్‌లో ఈనెల 24న జరిగే సంత్ సేవాలాల్ జయంతికి సంబంధించిన పోస్టర్లను బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో టీజీఓ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాం నాయక్ ఆవిష్కరించారు. జయంతి వేడుకలకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సుర్జాపూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్త భూమేశ్ తండ్రి మరణించడంతో.. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు రాజేందర్, రాజగంగన్న, వెంకట్‌రావు, ప్రదీప్, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సప్తాహం



శోభాయాత్రలో గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని ఇలేగాంలో వారం రోజులుగా సప్తాహం కొనసాగుతోంది. బుధవారం విఠలేశ్వరుని చిత్రపటంతో గ్రా మ ంలో ఊరేగింపు నిర్వహించి.. భజనలు చేస్తూ మంగళహారతులతో ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర చేశారు. ఇంటింటా విఠలేశ్వరుని చిత్రపటం తీసుకొచ్చి పూజలు చేశారు. చివరి రోజైన గురువారం అన్నదానం చేయనున్నట్లు సర్పంచ్ ముత్యం తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన సిందులవార్ రాములు ఇంట్లో దీపం మంటలు అంటుకొని దుస్తులు, సరుకులు కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కేంద్రానికి చెందిన వైద్యులు రమేశ్‌రెడ్డి మంగళవారం లక్ష్మణచాందలోని రాములు కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా వారికి కావాల్సిన నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేసి ఔదార్యం చాటుకున్నారు. సర్పంచ్ ముత్యంరెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వైద్యుడు గణపతిరెడ్డి ఉన్నారు.

మొక్కజొన్న పంట ధ్వంసం

లక్ష్మణచాంద: అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసమైన ఘటన మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చెందలి నర్సయ్య మొక్కజొన్న చేనును అడవిపందులు ధ్వంసం చేశాయి.

భూమిపూజ

భైంసారూరల్: మండలంలోని ఖత్‌గాం గ్రామంలో నిర్మించే పంచాయతీ భవన నిర్మాణానికి బుధవారం సర్పంచ్ రాజు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షల నిధులతో భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి, పీఆర్ ఏఈ ఉదయ్, గ్రామస్తులు ఉన్నారు.

ఎద్దు ఉసురు తీసిన కరెంట్

నర్సాపూర్(జి): మండలంలోని బామిని(బి) తండాలో బుధవారం జాదవ్ ఇంధల్‌కు చెందిన ఎద్దు విద్యుదాఘాతంతో మృతి చెందింది. మేతకు వెళ్లిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.65 వేలు ఉంటుందని.. ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బాధితుడు వేడుకున్నాడు.

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌లో బుధవారం ముస్లిం జేఏసీ, ఎండీసీ ఆధ్వర్యంలో అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీజీఓ జిల్లా అధ్యక్షుడు శ్యాంనాయక్, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ ఖలీల్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, ముస్లిం జేఏసీ అధ్యక్షుడు షబ్బీర్ పాషా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పసుపు రైతుకు కన్నీరు!

- తగ్గిన ధరలు, దిగుబడులు
- పెట్టుబడులు రావడం కష్టమే
- లబోదిబోమంటున్న అన్నదాతలు



లోకేశ్వరంలో ఉడకబెడుతున్న పసుపు పంట వద్ద రైతు

లోకేశ్వరం: వాణిజ్య పంట అయిన పసుపు సాగు చేసిన రైతులకు ఈసారి పెట్టుబడులు రావడం గగనంగా మారింది. తొమ్మిది నెలలు కష్టించి ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో లబోదిబోమంటున్నారు అన్నదాతలు.

పేరుకు పచ్చ బంగారమైనా పంట విక్రయిస్తే పచ్చనోట్లు తక్కువే వస్తున్నాయి. ఏటా పెట్టుబడులు పెరిగితే పంటకు ధర మాత్రం తగ్గుతూ వస్తోంది. దీంతో ఏం చేయాలో తోచడం లేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు.

ఈసారి ఆరువేలు దాటని వైనం..

అప్పులు తెచ్చి పసుపు పంట సాగు చేసిన రైతులకు ఈ ఏడాది గిట్టుబాటు ధర లభించని పరిస్థితి నెలకొంది. ఈసారి అధికంగా వర్షాలు కురువడంతో పాటు పసుపు పంటకు దుంపకుళ్లు, వేరుకుళ్లు సోకడంతో పంట తీవ్రంగా దెబ్బతింది. మూడేళ్ల కిందట క్వింటాలు పసుపునకు రూ.11 వేలు వరకు గిట్టుబాటు ధర లభించింది. గతేడాది రూ.ఎనిమిది వేల వరకు పలికిన పచ్చబంగారం ఈసారి ఆరువేలు దాటడం లేదు. గతేడాది ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా ఈసారి మాత్రం ఐదు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే చేతికొస్తుంది. కనీసం క్వింటాలుకు రూ.15 వేలైనా అందిస్తే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

జిల్లాలో 25వేల ఎకరాల్లో సాగు..

జిల్లాలో పసుపు పంటను 25వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. లోకేశ్వరం మండలంతో పాటు కుంటాల, ముధోల్, సారంగపూర్, మామడ, నిర్మల్, దిలావర్‌పూర్ మండలాల్లో ఎక్కువగా పంట సాగు చేస్తారు. ఎకరంలో విత్తనం నాటినప్పటి నుంచి పసుపు తవ్వి ఉడికించి ఆరబెట్టేందుకు ఎకరాకు సుమారు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. పంట మంచిగా పండితే ఎకరంలో 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఈసారి అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా దిగుబడి సగానికి పడిపోయింది. దీంతో ప్రస్తుతం పంటను తవ్వుతున్న రైతులు పెట్టుబడి కూడా చేతికి రాదని తెలిసి కళ్లలో నీళ్లు తిప్పుకుంటున్నారు.

అమ్ముకునేందుకూ అవస్థలే..

తొమ్మిది నెలలు కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు జిల్లాలో కొనుగోలు కేంద్రం లేదు. పక్కన ఉన్న నిజామాబాద్‌కు లేదా 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహారాష్ట్రలోని సాంగ్లీకి పంటను తీసుకెళ్లాలి. ఇది రైతులను భారంగా మారింది. జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తే తమకు మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు.

పంట వేయకపోవడమే నయం



మొదటి నుంచి పెట్టిన పెట్టుబడి అటుంచితే.. ఇప్పుడు పుసుపు తవ్వేందుకు పెడుతున్న ఖర్చే భయమేస్తోంది. ఇదే ధర ఉంటే బాగా నష్టపోతాం. వచ్చే సంవత్సరం ఈసంట వేయకపోవడమే నయమనిపిస్తోంది. ప్రభుత్వం మద్దతు ధర పెరిగేలా చూడాలి.

– శ్రీధర్, ధర్మోర

పెట్టుబడి వచ్చేలా లేదు



వర్షాలు, తెగుళ్ల కారణంగా ఈ సారి పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు. పసుపు రోజురోజుకు ఎ ర్రబడి ఎండిపోయింది. ఈ ఏ డాది నష్టం రాకుండా ఉంటే చాలు. పంటను అమ్ముకునేందుకు ఇబ్బంది పడుతున్నాం. సమీపంలో మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

– లింగం ,రాయపూర్‌కాండ్లీ

బీజేపీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పాక్‌పట్లలో మాట్లాడుతున్న రావుల రాంనాథ్

లోకేశ్వరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నాయకుడు బద్దం భోజారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని ధర్మోర గ్రామంలో ప్రజాగోస– బీజేపీ భరోసా కార్నర్ సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు గంగాధర్, జిల్లా కార్యదర్శి నల్ల రమేశ్, శ్రీనివాస్‌రావు ఈరన్న, గంగాధర్, వేణు ఉన్నారు.

'కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలి'

ఖానాపూర్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబపాలనకు చరమగీతం పాడినప్పుడే ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని బీజేపీ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆరో వార్డు పరిధి సాయినగర్‌లో ఏర్పాటు చేసిన స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ఖానాపూర్, కడెం మండలాలకు జీవనాధారం అయిన సదర్‌మాట్ నిర్మల్ నియోజకవర్గానికి వెళ్తే స్థానిక ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారో ఆయకట్టు రైతాంగానికి సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాజశేఖర్, దేశాయ్ రాము, రాజేశ్వర్, శ్రీనివాస్, సుధాకర్ ఉన్నారు.

లక్ష్మణచాంద: వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధిక సీట్లు గెలిచి తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. మంగళవారం సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్నర్ మీటింగ్ సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా.. బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేందర్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అశోక్, ఎస్టీ మోర్చా మండలాధ్యక్షుడు ముత్యం, ముత్యం పాల్గొన్నారు.

సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవం



ఖానాపూర్‌లో పాల్గొన్న రామయ్య, నాయకులు

ఖానాపూర్: మండలవ్యాప్తంగా సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆవిర్భావ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఊరూరా జెండాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం దేశ ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాలను వదిలిన అమరుల ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. ఆ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, నాయకులు అంకుష్‌రావు, రాజన్న, శంకర్, మున్వర్, వర్మ, గోరెబాయి, నడిపన్న, ఎల్లయ్య, శ్రీనివాస్, మధు, సోనెరావు, నర్సయ్య ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని ఐబీ వద్ద సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కె.రాజన్న పార్టీ జెండా ఆవిష్కరించారు. ఏఐకేఎస్ నాయకులు నంది రామయ్య, వాగ్మారే మహేందర్, గంగాధర్, పవన్, రాజారాం, సిద్ధార్థ్, గంగన్న, ఎండీ గఫూర్, కె.సాయన్న, కట్ట లక్ష్మి, ఎస్.లక్ష్మి తదితరులు ఉన్నారు.

నిర్మల్‌టౌన్: ప్రజా ఉద్యమాల నిర్మాణంతోనే ప్రజాతంత్ర విప్లవం సాధ్యమని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రాజన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని బుధవారం ఆ పార్టీ జెండా ఆవిష్కరించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



వరి పంట పరిశీలిస్తున్న అధికారి శ్రీనివాస్

ముధోల్: అధిక రసాయనాల వినియోగంతో వరిలో అగ్గితెగులు సోకే ప్రమాదం ఉందని.. రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డి.కార్తీక్, విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో రైతులతో ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధిక రసాయనాల వినియోగంతో భూమి సారం కోల్పోయి దిగుబడులు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకొని.. అందుకు అనుగుణంగా సేంద్రియ ఎరువులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ భాస్కర్, సర్పంచ్ దత్తాత్రి, ఏఈఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ముధోల్: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఫెడరేషన్ ముధోల్ డివిజన్ కార్యదర్శి పరమేశ్ మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులకు సైతం వసతిగృహ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అర్షద్, గంగాప్రసాద్, ప్రమోద్ తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

ముధోల్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో అందిస్తున్న రైతులకు శనగ కొనుగోలు టోకెన్ల పంపిణీని తహసీల్దార్ శ్యాంసుందర్ పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు సైతం క్యూలైన్ పద్ధతి పాటించి సిబ్బందికి సహకరించాలన్నారు. అనంతరం రైతువేదికలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

కంటివెలుగు పరిశీలన

ఖానాపూర్: కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఐదో వార్డు పరిధి ఇంద్రానగర్‌లో ఏర్పాటుచేసిన శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గొల్లమాడలో..

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ రైతువేదికలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని బుధవారం తహసీల్దార్ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఆర్ఐ వేణుగోపాల్ ఉన్నారు.

ఖానాపూర్ సీఐగా నారాయణనాయక్



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ

ఖానాపూర్: సర్కిల్ పరిధిలోని ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఖానాపూర్ సీఐ బి.నారాయణ నాయక్ అన్నారు. బుధవారం ఖానాపూర్ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి విలేకరులతో మాట్లాడారు. ప్రజలు సమస్యలుంటే ఆందోళన చెందకుండా 100కు సమాచారం ఇవ్వాలన్నారు. మధ్యవర్తులను ఆశ్రయించకుండా బాధితులు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావాలన్నారు.

1996లో ఎస్సైగా..

ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మదంపేటకు చెందిన నారాయణ నాయక్ 1996లో బెజ్జూరు ఎస్సైగా విధుల్లో చేరారు. తర్వాత కాగజ్‌నగర్, దేవాపూర్, జన్నారం, మంచిర్యాలటౌన్, సోమగూడెం, సీసీ నస్పూర్‌లో ఎస్సైగా పని చేశారు. 2010లో సీఐగా పదోన్నతి పొ ంది సీబీసీఐడీ వరంగల్‌లో పని చేశారు. అనంతరం రామగుండం, శ్రీరాంపూర్, లక్సెట్టిపేట, మంచిర్యాలలో పని చేసి తాజాగా ఖానాపూర్‌కు బదిలీపై వచ్చారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన సీఐ

పట్టణంలో ఎమ్మెల్యే రేఖానాయక్‌ను బుధవారం ఖానాపూర్ సీఐ నారాయణ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తమ సేవలతో పేదలకు న్యాయం చేయాలని సూచించారు.

క్రీడాకారిణికి అందుతున్న సాయం

సాక్షి ఎఫెక్ట్..



యువతిని సన్మానిస్తున్న నరేశ్

ఖానాపూర్: పట్టణానికి చెందిన జక్కుల నికిత అనే క్రీడాకారిణి అండర్ ఆర్మ్ అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు భారత జట్టుకు ఎంపికైంది. ఆమెది పేద కుటుంబం కావడంతో సాక్షి గత నెల 23న 'చేయూత కోసం క్రీడాకారిణి ఎదురుచూపు' అనే శీర్షికన కథనం ప్రచురించింది. ఇప్పటికే దాతలు రూ.20వేలు అందజేయగా.. తాజాగా గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కడారి నరేశ్ చొరవతో ఆ సంస్థ సభ్యులు బల్ల స్వరూప్, జయ రూ.10వేలు సమకూర్చారు. దీంతో నరేశ్ యువతికి సాయం అందించి సన్మానించారు.

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుపై పారుతున్న మురుగు



భైంసారూరల్: మండలంలోని టాక్లి గ్రామంలో డ్రెయినేజీలు లేకపోవడంతో ప్రధాన రోడ్డుపైనే మురుగు నీరు పారుతోంది. దీంతో దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నామని.. అధికారులు డ్రెయినేజీలు నిర్మించి తమ ఇక్కట్లు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: గోపాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ, ఫోన్: 9908523064

నేడు శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

భైంసా: బాసరలో గురువారం శనగ కొనుగోలు కేంద్రాన్ని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రారంభిస్తారని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. నాయకులతోపాటు జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సకాలంలో రావాలని కోరారు.

నేడు పట్టాలు పంపిణీ

భైంసాటౌన్: పట్టణంలో జీవో నం.58 కింద ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం ఉదయం 9:30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో పట్టాలు పంపిణీ చేస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో మొత్తం 1,011 దరఖాస్తులు రాగా వీటిలో 660మందికి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. అలాగే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు ఆధార్ జిరాక్స్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

రేపు టోకెన్లు పంపిణీ

తానూరు: మండలకేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 24న తానూరులోని డాంగపల్లి వ్యవసాయ గోదాంలో రైతులకు శనగ కొనుగోళ్ల టోకెన్లు పంపిణీ చేస్తామని సీఈవో భూమయ్య ఓ ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌తో వచ్చి అధికారుల వద్ద ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు పీఏసీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	20
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	25

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : సార్

నారాయణ: వినరో భాగ్యము విష్ణు కథ

నట్టల నివారణ మందు తాగించాలి



తానూరు: భోసిలో మందు వేస్తున్న అధికారులు

ఖానాపూర్: మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శంకర్ అన్నారు.బుధవారం మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈనెల 28 వరకు నిర్వహించే నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి దీప్తి, సర్పంచ్ గోపాల్, వైస్ఎంపీపీ వాల్‌సింగ్, తదితరులు ఉన్నారు.

తానూరు: పశువైద్య శిబిరాలను సద్వినియోగం పోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి గోపాల్ మహాజన్ అన్నారు. బుధవారం మండలంలోని భోసి గ్రామంలో పశువైద్య శిబిరంలో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరాత్రి ఆనంద్, వైద్యులు అమృత్, సిబ్బంది పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని వాటోలి గ్రామంలో బుధవారం మూగజీవాలకు నట్టల నివారణ మందు తాగించే కార్యక్రమాన్ని ఎంపీపీ కల్పన ప్రారంభించారు. గ్రామంలోని 96 గొర్రెలు, 385 మేకలకు మందు తాగించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిఖితసచిన్, పశువైద్యాధికారి విఠల్, గ్రామస్తులు ఉన్నారు.

అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి



కన్కపూర్‌లో కేంద్రం పరిశీలిస్తున్న సీడీపీవో శ్రీమతి

లోకేశ్వరం: అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని ముధోల్ సీడీపీవో శ్రీమతి అన్నారు. బుధవారం మండలంలోని కన్కపూర్, అబ్దుల్లాపూర్, వట్టోలి, ధర్మోర, పంచగుడి, లోకేశ్వరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో పరిశీలించారు. సీడీపీవో మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రతి నెలా చిన్నారుల ఎత్తు, బరువుల వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

పంట అమ్ముకునేందుకు రైతుల పాట్లు



ముధోల్: పండించిన శనగ పంటను అమ్ముకునేందుకు రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం శనగ కొనుగోళ్లకు సంబంధించిన టోకెన్లు పంపిణీ చేస్తామనడంతో మంగళవారం రాత్రి నుంచి రైతులు పడిగాపులు కాశారు. తమ చెప్పులను వరుస క్రమంలో ఉంచి అక్కడే పడుకున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిర్మల్

90106 10882
99122 20764

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899